నా మాట

"Freedom is the recognition of necessity" - Engles

"మన జీవితాల్లోనయినా, వాటిచుట్టూ వుండే సమాజంలోనయినా - వాటి చలన సూత్రాలను అన్వేషించడమే ఆవశ్యకత. ఆ ఆవశ్యకతను గుర్తించటమే స్వేచ్ఛ. ఆ అన్వేషణ దశలో - స్వేచ్ఛ నవలలోని హీరోయిన్ జీవితంలోలా - సంక్షోభమూ వుంది, సంఘర్షణా వుంది. ఆవశ్యకతను గుర్తించిన తర్వాత - స్వేచ్ఛానంతర జీవితంలో సంఘర్షణే గాని సంక్షోభం వుండే అవకాశం లేదు"

– సి. వి. సుబ్బారావు

'స్వేచ్ఛ' ను నవలగా ప్రచురిస్తే దానికి ముందుమాట రాయాలని ఎంతో కుతూహలపడిన ప్రియ మిత్రుడు సుబ్బారావు లేకుండా స్వేచ్ఛ నవల ప్రచురిత మవటం నా జీవితంలో పెద్ద విషాదం. సుబ్బారావు ఉత్తరాల్లో రాసిన నాలుగు వాక్యాలూ తిరిగి రాసుకోవటం తప్ప మరేం చెయ్యగలను? నాకూ, సుబ్బారావుకీ మాట్లాడుకోడానికి చాలా యిష్టంగా వుండే విషయం స్వేచ్ఛానంతర జీవితం. బహుశ యిద్దరం ఆ జీవితపు ఆటుపోట్లలో పడి కొట్టుకున్న వాళ్ళం కాబట్టేమో! 'స్వేచ్ఛ' నవల వచ్చాక మేమిద్దరం ఎప్పుడు కలిసినా స్వేచ్ఛానంతర జీవితం గురించి చర్చించకుండా వుండేవాళ్ళం కాదు. తను రాసే ముందుమాటలో ఆ చర్చల సారాంశమంతా వుంటుందని వూరించి వూరించి మాటమాత్రం చెప్పకుండా మాయమైపోయాడు! ఇప్పుడు స్వేచ్ఛ నవల గురించి నాలుగు మాటలు రాద్దామంటే ఏమీ చేతకానిదానిలా అయిపోతున్నాను. నా శక్తంతా కూడగట్టుకుని సుబ్బారావు మరణం నుంచి స్వేచ్ఛ పొందే ప్రయత్నం చెయ్యాలని గట్టిగా అనుకుని నాకు తోచినదేదో రాస్తున్నాను.

'స్వేచ్ఛ' మొదట చతురలో ప్రచురించబడి ఏడేళ్ళు నిండాయి. (1987 ఫిబ్రవరి). ఈ ఏడేళ్ళ కాలంలో యింత వివాదాస్పదమయిన నవల, యింతగా చర్చింపబడిన నవల మరొకటి రాలేదు. ఈ నవల వచ్చిన సంవత్సరమంతా ఆంధ్ర దేశంలోని అన్ని పట్టణాల్లోనూ సాహిత్యాభిమానులూ, పాఠకులూ, వామపక్ష పార్టీల వాళ్ళూ ఈ నవల గురించి విస్తృతంగా చర్చించారు. ఆ చర్చలు క్రమంగా

సాహిత్యప్రదేశాన్ని ఒదిలి నా వ్యక్తిగత జీవితంలోకి చొచ్చుకు వచ్చాయి. నా జీవితంలో - బాధాకరమే అయినా - అపురూపమైన విలువైన అనుభవాలను యిచ్చాయి. స్నేహం, ప్రేమ, ద్వేషం, సాహిత్యం, జీవితం, రాజకీయాలు, స్త్రీల సంఘాలు, స్త్రీల పరస్పర సహకారం, వీటన్నిటి గురించీ ఎన్నో విలువైన పాఠాలను నేర్చుకున్నాను. ఒక వ్యక్తిగా మరింత బలమైన, స్థిరమైన అభిప్రాయాలతో నిలబడగలిగాను. అట్లా నిలబడగల శక్తి నాకుందని తెలుసుకునే అవకాశం నాకిచ్చింది 'స్వేచ్ఛ' నవల.

ఆ విషయాలు పక్కన పెడితే స్వేచ్ఛ నవల ఎందుకంత వివాదాస్పద మయింది అని ఆలోచిస్తే ఆనాటి చారిత్రక సందర్భం అలాంటిదని అర్థమవుతుంది. స్త్రీవాద భావాలు కొత్తగా ప్రచారమవుతున్న రోజులు. సిద్ధాంత విషయాలుగా చర్చల్లో నలుగుతున్న అంశాలను, కుటుంబ విషయాలుగా, మనందరి జీవితాలకూ సంబంధించిన విషయాలుగా చెబుతూ- ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబ స్త్రీ సమస్యగా చర్చించటంతో ప్రతివాళ్ళూ తమ జీవితాల్లోకి ఒకసారి తొంగి చూసుకున్నారు. ఇంతవరకూ వాళ్ళు పక్కన పెడుతున్న ప్రశ్నలను, avoid చేస్తున్న ప్రశ్నలను యిక తప్పించుకోటానికి వీల్లేని విధంగా వాళ్ళ అమ్మాయిలాంటి, చెల్లెలులాంటి, భార్యలాంటి ఒక స్త్రీ అడిగేసరికి చాలామందికి చాలా యిబ్బంది కలిగింది. ఈ ప్రశ్నలు అడగలేకపోతున్న స్త్రీలకు ఈ నవల అడిగే బలాన్నిస్తుందేమో ననే భయం కలిగింది. చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నప్పటికి ఇంటా బయటా ప్రత్యక్ష పరోక్ష అణచివేతలో ఉక్కిరి బిక్కిరవుతున్న ఆధునిక స్త్రీ జీవితాన్నీ, ఆమె ఉనికికి అర్థాన్నీ ప్రశ్నించే ఈ నవల సంచలనాన్ని కలిగించింది.

స్వేచ్ఛ అనే పేరే నచ్చలేదు కొందరికి. స్వేచ్ఛ, అంతులేని స్వేచ్ఛగా బాధ్యతా రహితమైన స్వేచ్ఛగా కనిపించింది. ఏ ప్రయోజనాన్ని ఆశించి స్వేచ్ఛను ప్రతిపాదించాననే ప్రశ్నకూడా వచ్చింది. కానీ స్వేచ్ఛకు అర్థం యేమిటని చాలా మంది ఆలోచించినట్లు కనపడదు. **Liberty, Equality, Fraternity** అని ఫ్రెంచి విప్లవ నినాదం. ఈ మూడిటికీ ఒక వరస వుంది. మూడూ వేరు వేరు విషయాలు. స్వేచ్ఛ, సమానత్వం అని వేరు వేరుగా పిల్చినా చాలామంది ఆ రెంటికీ తేడా లేదన్నట్లు ఆలోచిస్తారు. సమానత్వం సాధిస్తే స్వేచ్ఛ దొరుకుతుందనుకునే వారూ వుంటారు. సమానత్వం లేకుండా స్వేచ్ఛ వుంటుంది గానీ స్వేచ్ఛ లేకుండా సమానత్వానికి అర్థం వుండదు. అది నిలబడదు కూడా. సమాజంలో అసమానతలను పోగొట్టి

సమానత్వం సాధించాలన్నా, సమాన హక్కులూ అవకాశాలూ వున్న మనుషులు పరస్పరం సహకరించుకుంటూ బతకాలన్నా ముందు మనిషి సాధించాల్సింది స్వేచ్ఛ. ఈ స్వేచ్ఛ ఎవరో ఒకరిచ్చేది కాదు. ఎవరి దగ్గరనుండో సాధించుకునేది కాదు. మన అవసరాలను, మన ఉనికికి అత్యవసరమైన విషయాలను, మనం గుర్తించటమే స్వేచ్ఛ. నిజానికి యిది సాధించటమే చాలా కష్టం. మన నుండి మనకు స్వేచ్ఛ. మనకు పుట్టుక నుండి అలవాటైన భావాల నుండీ, అభిప్రాయాల నుండీ, ఆచారాల నుండీ స్వేచ్ఛ. మనలో జీర్ణించుకుపోయిన నమ్మకాల నుండి విడుదల. సామాజిక మార్పులు అనివార్యమైనపుడు ప్రజల్లో ఈ స్వేచ్ఛాకాంక్ష పుట్టుకువస్తుంది. సమాజాన్ని గురించీ, సమాజంలో తన ఉనికి గురించీ, తమకూ సమాజానికీ వున్న సంబంధం గురించీ, ఆ సంబంధాలలో వున్న అణచివేత గురించీ ప్రశ్నించుకుని జవాబులు వెతికే ప్రయత్నం చేసేవారు స్వేచ్ఛాపథగాములు. వాళ్ళ జీవితాలలో సంఘర్షణలుంటాయి గానీ సంక్షోభాలుండవు. సంక్షోభ దశనుండి దాటే క్రమాన్ని అరుణ జీవితం ఆధారంగా నేనీ నవలలో చిత్రించాను. అరుణ నవల చివరకు సంక్షోభ దశ దాటి సంఘర్షణలో ఆనందాన్ని పొందగలిగే దశకు వచ్చింది. ఈ స్వేచ్ఛ అనే భావాన్ని అర్థం చేసుకోకుండా, జీవితంలో దానిని పొందకుండా, అనుభవించ కుండా మనం చేసే పోరాటాలకు అర్థం వుండదు. ఏ అసమానతలను రూపుమాపాలని పోరాటం చేస్తామో వాటిని యింకో రూపంలో తెచ్చిపెట్టే పోరాటమే అవుతుంది స్వేచ్ఛ లేకపోతే. ప్రతి మనిషీ తన స్వేచ్ఛను - తాను ఎవరికీ, ఏ పెత్తనానికీ లొంగివుండని స్వేచ్ఛను సాధించుకోవాలి. ఆ స్వేచ్ఛను సాధించుకునే క్రమంలో మనిషికి తన స్వేచ్ఛ యితరులకు అపకారం చేయగూడదనే విషయం అర్థమవుతుంది. స్వేచ్ఛలో వున్న బాధ్యత స్వేచ్ఛారాహిత్యంలో వుండదు. స్వేచ్ఛానంతర జీవితంలో మనిషి తనకు తానూ, సమాజానికీ బాధ్యుడవుతాడు. అందువల్ల స్వేచ్ఛను సరిగా అర్థం చేసుకున్న వారికి బాధ్యతా రహితమైన స్వేచ్ఛ అంటూ వుండదనీ, బాధ్యతా రాహిత్యమంటే దేనికో దానికి బానిసత్వం చేయటమేననీ తెలుస్తుంది. ఆడవాళ్ళు స్వేచ్ఛ లేకుండా, సమాజం తమకు నిర్దేశించిన పనులను ప్రశ్నించకుండా, ఆ పనులు తమనేం చేస్తున్నాయో, తమ ఉనికినెలా అర్థరహితం చేస్తున్నాయో తెలుసుకోకుండా వుండడమంటే చాలా బాధ్యతా రహితంగా వుండటం. పుట్టింది పెళ్ళి చేసుకోటానికన్నట్టే బతికే స్త్రీలు, అంతకంటే తమ జీవితాలకు మరో పరమార్థం లేదనీ, కుటుంబాల్లో శాంతిని కాపాడటమే తమకు శాంతి అనుకునీ బతికే స్త్రీలు

చాలా బాధ్యతా రహితంగా బతుకుతున్నారు. వారికి తమ పట్లా, సమాజం పట్లా విముఖత్వం తప్ప ఆసక్తి లేదు. సమాజం మారాలని కోరే పురుషులు కూడా ఆ మార్పేదో తాము తీసుకువస్తామనీ, స్త్రీలు అవసరమైనపుడు తమకు సహకరించి కుటుంబంలో వాళ్ళ పాత్ర వాళ్ళు పోషిస్తే చాలనీ చాలా బలంగా నమ్ముతారు. అసలు మార్చాల్సింది తమ జీవితాలననీ, తమ జీవితాల గురించి పురుషుల అభిప్రాయాలననీ స్త్రీలు గ్రహించటమంటే ఈ పురుషాధిపత్య సమాజానికి చాలా పెద్ద ప్రమాదం.

తమ పట్ల తమకొక బాధ్యత, సమాజం పట్ల ఒక బాధ్యత వుందన్న భావన లోపలనుంచీ రాకుండా స్వేచ్ఛను ఎవరూ కాంక్షించరు. ఈ బాధ్యతల విషయంలోనే చాలామందికి పేచీ వస్తుంది. ఇంతకు ముందు చెప్పుకున్నట్లు పెళ్ళాడి భర్తతో సంసారం చేసి పిల్లల్ని కని పెంచడమేకదా స్త్రీకి బాధ్యత అని ప్రశ్నిస్తారు. ఆ బాధ్యతలను ఆమె యిష్టంతో స్వీకరించిందా, తను ఎంచుకున్నదా లేక తరతరాలుగా పితృస్వామ్య సమాజం స్త్రీ మీద ఈ బాధ్యతలను మోపిందా అనే ప్రశ్న మొదటి ప్రశ్నకు సమాధానంగా వస్తుంది. ఈ ప్రశ్నకు సమాధానం వెతుకుతూ పోతే పితృ స్వామ్య సమాజపు మూలాలన్నీ కదిలి మన చేతిలోకి వస్తాయి. స్త్రీల అణచివేత క్రమమంతా, ఆ చరిత్రంతా మనం అర్థం చేసుకోవాల్సి వస్తుంది. పునరుత్పత్తి రాజకీయాల ప్రాంగణంలోకి మనం ప్రవేశిస్తాం. కుటుంబంలో కంట్రోలు, అధికారం, లైంగిక సంబంధాల చర్చావేదిక మన కోసం సిద్ధమవుతుంది. ఈ లైంగికత్వం, పునరుత్పత్తి కార్యక్రమం స్త్రీల జీవితాలను శాసించి వారి జీవితాలకు ఒక సాంస్కృతిక రూపాన్ని యిస్తుంది అన్న విషయం మనకు ఈ చర్చల్లో అర్థమవుతుంది. ఆ విషయం తెలిశాక భార్యాత్వం, మాతృత్వం,వేశ్యాత్వం అన్నీ స్త్రీల మీద మోపబడిన శిలువలనీ, ముళ్ళకిరీటాలనీ నిజంగా స్త్రీలు ఎంచుకున్న బాధ్యతలు కాదనీ అర్థమవుతుంది. నిజంగా ఎంచుకునే స్వేచ్ఛ ఎలా ఎప్పుడు సాధించుకోగలమని తహతహలాడతాం. ఈ బాధ్యతలు బలవంతంగా విధించిన వనే విషయం చాలామంది స్త్రీలకు వారి జీవితానుభవాల ద్వారా-వూపిరాడని అణచివేత, ఉనికిని హరించే హింస- వీటిద్వారా అర్థమవుతాయి. వాళ్ళు జీవితంలో సంక్షోభానికి గురవుతారు. ఆ సంక్షోభంలోంచి తమ అణచివేతను నిర్దేశించి కొనసాగిస్తున్న సామాజిక చలన సూత్రాలను కనిపెట్టాలనే కోరిక కలిగినపుడు ఆ సంక్షోభంలో సంఘర్షణ పడతారు. సంఘర్షణకు పూనుకోవటమే స్వేచ్ఛాకాంక్షకు సంకేతం. వ్యక్తుల స్వేచ్ఛా కాంక్షకూ, సాంఘికంగా

వుండే కట్టుబాట్లకూ ఒక ఘర్షణ ఎప్పుడూ వుంటుంది. స్త్రీల విషయంలో ఈ ఘర్షణ మరింత ఎక్కువ. ఈ ఘర్షణ చాలా విలువైనది. సమాజం మరింత ప్రజాస్వామికంగా మారటానికీ వ్యక్తుల జీవితాలు మరింత సుఖంగా సాగటానికీ ఈ ఘర్షణ అత్యవసరం. అందరికీ ఆమోదయోగ్యమైన విధానం ఏదీ వుండదు. వ్యక్తుల స్వేచ్ఛకూ సామాజిక బాధ్యతలని మనం అనుకునేవాటికి మధ్య వుండే ఘర్షణను రాజకీయం చేసుకోవటంలోనే స్త్రీవాదం ప్రత్యేకత వుంది.

ఈ నవలలో అరుణ ఈనాటి మధ్యతరగతికి చెందిన ఆధునిక స్త్రీ. ఈ స్త్రీలు చదువుకుంటున్నారు. రకరకాల ఉద్యోగాలు చేసి ఆర్థికంగా స్వతంత్రులమనుకుంటున్నారు. వాళ్ళ చదువుల్లో ఉద్యోగాల్లో వాళ్ళకు వచ్చే గుర్తింపు, కొంచెం పెరిగిన వారి చోటూ, స్వతంత్రంగా ఆలోచించగల బుద్ధీ, దానివల్ల పెరిగిన ఆత్మగౌరవం, రకరకాల సాంఘిక సంబంధాలలోకి వెళ్ళే అవకాశం యివన్నీ కలిసి వాళ్ళను ప్రభావితం చేస్తాయి. వాళ్ళ స్వభావాన్నీ, జీవితం పట్ల వాళ్ళ దృక్పథాన్నీ మారుస్తాయి. కుటుంబం గురించీ, అందులోని అధికారం గురించీ సంప్రదాయభావాలకు తలవంచక కొత్త ఆలోచనలు చేస్తారు. సాంస్కృతికంగా తమమీద రుద్దబడిన భావజాలాన్ని ప్రశ్నించటం ప్రారంభమవుతుంది. ఎప్పుడైతే అమలులో వున్న భావజాలాన్ని ప్రశ్నించారో అప్పుడు వ్యక్తిగత స్థాయిలోనూ సామాజిక స్థాయిలోనూ ఘర్షణ మొదలవుతుంది. ఇంట్లో విధేయంగా అణిగి మణిగి పరాధీనగా వున్న స్త్రీ, ఉద్యోగంలో ధైర్యంగా, నైపుణ్యం గలదానిగా, పట్టుదలతో లక్ష్యం సాధించేదానిలా, తెలివితో, బాధ్యతతో ప్రవర్తించాలి. ఉద్యోగంలో, సమాజంలో యింత తెలివిగా బాధ్యతగా ప్రవర్తించటం నేర్చుకున్న స్త్రీ ఆ తెలివినీ బాధ్యతనూ యింటికి కూడా తీసుకువస్తుంది. కుటుంబ పెద్దలను ధైర్యంగా ప్రశ్నిస్తుంది. దానితో వస్తుంది పేచీ. దాదాపు యాభై సంవత్సరాలుగా సాంఘిక జీవితంలోకి, వుద్యోగ వ్యవహార రంగాలలోకి స్త్రీలు రావటం రోజు రోజుకీ పెరుగుతోంది. స్త్రీల మీద అనేక కొత్త విధులు, పనులు వచ్చి పడుతున్నాయి - పాతవి మాత్రం ఒక్కటి కూడా వదిలిపోవటం లేదు. ఈ మొత్తం బరువుతో ఉక్కిరిబిక్కిరవుతున్న స్త్రీలు ఆ బరువుని దించుకునే మార్గాల కోసం వెతుకుతున్నారు. తమని తాము పోషించుకుని, రక్షించు కోగలమనుకున్న స్త్రీలు దృష్టిని తమ మీది నుంచి సమాజం మీదకు మళ్ళిస్తున్నారు. ఇట్లాంటి కొత్త స్త్రీలు పడే క్షోభనూ, ఎదుర్కొనే సమస్యలనూ కొంతవరకు పట్టుకోగలిగింది 'స్వేచ్ఛ' నవల.

సంగతేమిటనేది అంతరాంతరాలలో అందరినీ వేదించింది. ఇట్లా సమాజంతో సంబంధం కావాలని కుటుంబాలను ఒదిలితే కుటుంబ వ్యవస్థ ఏం కావాలని గగ్గోలు పడిపోయారు.

అరుణ కుటుంబాన్ని ఒదిలి వూరుకోలేదు. సమాజంలో చైతన్యం తీసుకు రావటం కోసం పనిచేస్తున్న సంఘాలు ఆడవాళ్ళ పట్ల ప్రవర్తించే తీరుని కూడా ప్రశ్నించింది. తనను వ్యక్తిగా కాక ఒకరి భార్యగా మాత్రమే చూసి ఆ భార్యాత్వమే తనకు ముఖ్యమని చెప్పబోయిన సంఘాన్ని కూడా ఒదిలేసింది. ఈ సంఘటన రాజకీయ పార్టీల వారి గొంతుకడ్డం పడింది. ఎందుకంటే వామపక్ష రాజకీయ పార్టీలలో కూడా స్త్రీ స్థానం చర్చనీయాంశమే. విప్లవోద్యమాలలో, విప్లవ సంఘాలలో పని చేసిన స్త్రీలకు ఆయా వుద్యమాలలో కూడా అధికారాలూ, పెత్తనాలూ, ప్రతికూలతలే ఎదురయ్యాయి. స్త్రీలు 'మంచివారు'గా 'కుటుంబ స్త్రీలు'గా మాత్రమే తమ సంఘాలలోకి వచ్చి పని చేయాలనీ, తమ సంఘాల 'పరువు' కాపాడాలనీ, కుటుంబ గౌరవం కాపాడుకోవాలనీ- యిట్లా స్త్రీల గురించి రాజకీయ పార్టీలు మరో రాజకీయ కుటుంబ భావజాలాన్ని తయారు చేసుకున్నాయి. ఆ ధోరణిని ఎత్తి చూపి విమర్శించిన నవలగా 'స్వేచ్ఛ' వారికి కంటకప్రాయమైంది. అరుణ తను పని చేస్తున్న సంఘాన్నించి బైటికి వచ్చేసింది గాబట్టి వ్యక్తివాది అనీ- ఈ నవల వ్యక్తి వాదాన్ని ప్రోత్సహిస్తుందనీ అనేసి తమ భారాన్ని దించుకోజూశారు పది సంఘాలూ, పార్టీలు మారినవారు కూడా. తాము పార్టీల నుంచీ సంఘాల నుంచీ బైటికి వస్తే అది సిద్ధాంత విభేదాల వల్లననీ, అరుణ అతి చిన్న వ్యక్తిగత విషయానికి వచ్చేసిందనే వారికి వ్యక్తిగతం కూడా రాజకీయమేననే రాజకీయ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోమని చెప్పటమే ఈ నవల ఉద్దేశమని మళ్ళీ గుర్తు చేస్తున్నా. అరుణ కూడా తమలాగే తనకు నచ్చని సంఘం నుంచి వచ్చిందనీ, స్త్రీలకు కూడా అధికారం, చోటూ వుండే సంఘాన్ని నిర్మించే ఆలోచన ఆమెకు కలిగిందనే విషయాన్ని బొత్తిగా గమనించరు. గమనిస్తే తమ తప్పులు ఒప్పుకోవాలి. ఈ ఏడేళ్ళుగా రాజకీయ పార్టీల్లో స్త్రీల స్థితిని గురించీ, "స్వేచ్ఛ" నవల రేకెత్తించిన ప్రశ్నల గురించీ చర్చలు జరుగుతూనే వున్నాయంటే ఈ ప్రశ్నలు వాస్తవమైనవనే విషయం యిప్పటికైనా అందరూ గుర్తిస్తున్నారని నమ్ముతున్నాను.

మొత్తానికి కుటుంబాల్లో, రాజకీయాల్లో స్త్రీల అనుభవాలను స్త్రీల దృష్టినుంచి చెప్పి ఆ అనుభవాల సారాంశాన్ని కొత్త పద్ధతిలో అర్థం చేసుకోవాలని సూచించటం ఈ నవలలో బలం. పురుషాధిపత్యాన్ని సమర్థించేవారికి నచ్చని అంశం కూడా అదే.

ఈ నవలలో ఉమ పాత్ర పెళ్ళి ఒద్దనుకుని తను ప్రేమించిన యువకుడితో కొత్త పద్ధతిలో జీవితం గడిపే పాత్ర. నిజానికి పెళ్ళితో స్వతంత్రం పోతుందనుకుని పెళ్ళి ఒద్దనుకున్న పాత్రలు తెలుగు సాహిత్యానికి కొత్త కాదు. కొడవటిగంటి కుటుంబరావుగారి నవలలు 'నీకేం కావాలి'లో కస్తూరి, 'ఎండమావులు'లో సుందరం యిలాంటివాళ్లే. ఐతే ఆ పాత్రలు కుటుంబ జీవితానికి వెలుపలవున్న పాత్రలు. వేశ్యావృత్తి నుండి వచ్చిన పాత్రలు. అందువల్ల ఆ అభిప్రాయాలు ఎవరినీ పెద్దగా కలవరపెట్టలేదు. వేశ్య పెళ్ళి చేసుకోకపోతేనే కుటుంబ వ్యవస్థకు భద్రత కదా? కానీ కస్తూరినీ, సుందరంనూ ఆదర్శంగా తీసుకుని కుటుంబ స్త్రీలు కూడా పెళ్ళి లేకుండా మగవాళ్ళతో సంబం ధంలో వుండటానికి సిద్ధపడతారని కొడవటిగంటిని అభిమానించే పాఠకులు వూహించి వుండరు. ఉమలాంటి మంచి కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి, విద్యాధికురాలు పెళ్ళి ఒద్దని, నచ్చినవాడితో ప్రేమ జీవితం తప్ప కుటుంబం ఒద్దనుకోవటం చాలా కల్లోలాన్ని రేపింది. పిల్లల సంగతేమిటనే ప్రశ్న వచ్చింది. ఆ ప్రశ్న 'స్వేచ్ఛ' నవల నుండి 'ప్రయోగం' కథ వరకూ వేధిస్తూ వస్తూనేవుంది. మగవాడిని ఒక యింట్లో కట్టెయ్యక పోతే యిక్కడ ఈమెకు పిల్లల్నికని, యింకోచోట యింకొకరికి కని యిలా పిల్లల్ని కంటూ పోతే ఆ ఆడవాళ్ళంతా అతని పిల్లల్ని పెంచాలా అనే చౌకబారు ప్రశ్నలు కూడా వచ్చాయి. ఇలాంటి మగవాళ్ళు అమాయకులైన ఆడవాళ్ళనిలా అవస్థల్లో పడేస్తూనే వున్నారు అనేది ఒక విషయమైతే, అవకాశం వస్తే ప్రతి మగవాడూ యింత హీనంగానే ప్రవర్తిస్తాడని అనుకునే వీళ్ళు స్త్రీవాదులను పురుషద్వేషులనటం రెండో విషయం. నిజానికి ఈ ప్రశ్నలు అడగాల్సింది అట్లాంటి పురుషుల్ని. పురుషుల బాధ్యతారాహిత్యాన్ని పట్టించుకోకుండా పిల్లల బాధ్యతనంతా స్త్రీమీదనే పడెయ్యటం, ఆ పని స్త్రీదే అన్నట్లు మాట్లాడటం అంటే పురుషుల ప్రయోజనాల్ని కాపాడటమే ఔతుంది.

విద్యాధికురాలై, పెళ్ళి ఒద్దనుకుని, తన జీవితం గురించి తనే నిర్ణయాలు తీసుకునే స్వతంత్ర స్త్రీ, బాధ్యత గుర్తించిన స్త్రీ, తను ఎవరితో సంబంధంలోకి

వెళ్ళబోతోందో ఆ పురుషుడిని అన్నివిధాలా గమనించి, అర్థం చేసుకుని మాత్రమే అతనితో సంబంధంలోకి వెళ్తుంది. ఆమెకు తెలివీ, పిల్లల బాధ్యత గురించి మగవాళ్ళను అడిగే ధైర్యం, వారికి సమానంగా బాధ్యతలు పంచే చొరవా వుంటాయి. అమాయకంగా పురుషుల మాయమాటలకూ, పెళ్ళి చేసుకుంటానన్న కపట వాగ్దానాలకూ, పెళ్ళాడి పిల్లల్నికని వారిని పట్టించుకోని వంచనకు బలైపోతున్న స్త్రీలకూ- చాలా బాధ్యతగా తమ జీవితాల గురించి ఆలోచించుకొని, ఎంచుకుని, అవతలి పురుషుడ్ని అంచనావేసి అపుడు మాత్రమే పిల్లల్ని కనాలనే స్త్రీలకూ తేడా చూడ కుండా స్త్రీలంటే మోసపోయే తెలివిహీనులుగానే పరిగణించి మాట్లాడతారు. పిల్లల్ని కనటం ఎంత బాధ్యతో, వాళ్ళను పెంచటానికి ఎంత సమయం వెచ్చించాలో తెలియకుండా, అసలు పిల్లల్ని కనటం గురించి ఏమీ తెలియకుండా తల్లులయ్యే స్త్రీల గురించి బాధపడాలి, భయపడాలి గాని, బాధ్యతతో ఆ పని ఆలోచించి చేస్తామనే స్త్రీల గురించీ, ఆ పద్ధతి గురించీ భయపడటం ఎందుకో అర్థం కాదు. అమాయకులైన స్త్రీలు కూడా యిలాంటి తెలివీ శక్తియుక్తులూ తెచ్చుకుని తమ జీవిత గమనాన్ని తామే నిర్ణయించుకునే చైతన్యం పొందాలని ఈ విమర్శకులు కోరుకోరా? అమాయకంగా మోసపోయే స్త్రీల బాధల్ని హృదయ విదారకంగా రాయటంవల్ల ఒకరకమైన ప్రయోజనం నెరవేరితే, ఉమ వంటి పాత్రల్ని సృష్టించటం వల్ల మరో రకమైన ప్రయోజనం నెరవేరుతుంది. ఒక కొత్త ఆలోచన వినగానే కలిగే సహజ మైన భయం తప్ప ఈ విమర్శలకు మరో ఆధారం లేదు. నిజానికి యిలాంటి విమర్శలూ, చర్చలూ చాలావరకు అకడమిక్ చర్చలే. ఈ సమాజపు కట్టుబాట్లు తమ అభివృద్ధికి ఆటంకమని గ్రహించి, సమాజం సృష్టించిన నమూనాలో యిమడలేక సంఘర్షణ పడే స్త్రీలు ఎప్పుడూ ఉంటారు. వాళ్ళు కొత్తభావాలనూ, కొత్త ఆచరణనూ అకడమిక్ చర్చల పరిధులకు అవతల సృష్టిస్తూనే ఉంటారు. **Simon de Boauvoir** అన్నట్లు "మన జీవిత పరిస్థితుల గురించిన సరైన జ్ఞానం నుంచే మనం జీవించే శక్తినీ మన జీవన సరళికి హేతువులనూ సంపాదించుకోవాలి." అట్లాంటి జ్ఞానాన్ని సంపాదించుకోవాలనుకునే స్త్రీలకు తమ జీవిత పరిస్థితులను అర్థం చేసుకోవటంలో ఏ కొంచెం సహాయపడినా ఈ నవల ప్రయోజనం నెరవేరినట్లే.

ఈ నవల అరుణకు గానీ ఉమకు గానీ అటువంటి స్త్రీలకు గానీ ఏ పరిష్కారాన్ని అందించింది అనేది చాలామంది అడిగే మరో ప్రశ్న. అసలు

రచయితలను సమస్యలకు పరిష్కారాలు, అందులోనూ సరైన, కరెక్టయిన, ఏ పొరపాటూ లేని పర్ఫెక్టు పరిష్కారాలు అడగటం, వాటికోసం రచనల్లో వెతకటం చాలా తెలివి తక్కువతనం. అట్లా వెతకొద్దని కొడవటిగంటి కుటుంబరావుగారు ఎన్నడో చెప్పారు తన సాహిత్య ప్రయోజనం వ్యాసాలలో అదట్లా వుంచి స్త్రీల సమస్య లుగా కనపడే పునరుత్పత్తి రాజకీయాలు లేవదీసే ప్రశ్నలకు వ్యక్తిగత స్థాయిలో సమాధానాలు, పరిష్కారాలూ చెప్పలేము. ఒక వ్యక్తి తన సమస్యను చాలా సమర్థతతోనో, తెలివిగానో పరిష్కరించుకున్నట్లు రాసినంత మాత్రాన అది నిజమైన పరిష్కారం, అందరికీ వర్తించే మార్గం అవదు. స్త్రీ స్వేచ్ఛ గురించీ, లైంగిక పునరుత్పత్తి హక్కుల్ని గురించీ రాసే రచయిత చేయగలిగిందేమిటంటే యింతవరకూ వ్యక్తిగతమైన విషయాలు, ప్రైవేటు విషయాలు అనుకుంటున్న వాటిని బయటికితీసి సాంఘిక విషయాలుగా నిరూపించి సాంఘిక పరిష్కారాల కోసం వెదకమని సూచించటం. ఆ పని సమర్థవంతంగా చేయటంలోనే నేటి స్త్రీవాద రచయితల విజయం, బలం కనిపిస్తాయి. స్వేచ్ఛ నవల అలాంటి ప్రయత్నమే.

– ఓల్గా
మే, 1994